
సాక్షి
గుంటూరు
మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లను సోమవారం దేవదాయ శాఖ ఏసీ టి.చంద్రకుమార్, డీసీ బి.మహేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 517.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 817.30 అడుగుల వద్ద ఉంది.



నేటి నుంచి కలశాభిషేకం

పాత గుంటూరు: చౌడవరం గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమంలో మంగళవారం నుంచి పుష్కర బ్రహ్మ కలశాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జోరుగా అవినీటి వ్యాపారం!

- పర్యవేక్షణ లోపంతో ఇష్టానుసారం నీటి విక్రయం
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- ప్రమాణాలు పాటించకపోవడం వల్ల క్లేబిసిల్లా బ్యాక్టీరియా ప్రబలి వాంతులు, విరేచనాలు, చర్మవ్యాధులు
- రీజినల్ ల్యాబొరేటరీ శ్యాంపిల్స్ పరిశీలనలో విస్తుపోయే నిజాలు

నగరంలో పుట్టగొడుగుల్లా అనుమతులు లేని వాటర్ ప్లాంట్లు



శ్రీనగర్‌లో నాణ్యత లేని నీటిని విక్రయిస్తున్న ఓ వాటర్ ప్లాంట్

సాక్షి ప్రతినిధి,గుంటూరు: గుంటూరు నగరంలో విచ్చలవిడిగా ప్రతి వీధిలో వెలిసిన అనుమతి లేని మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. ఒక్క గుంటూరు నగరంలోనే సుమారు 180కి పైగా మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయి. వీటిలో అధికశాతం ప్లాంట్‌లు నిర్దేశిత ప్రమాణాలు పాటించడం లేదు వీటికి అనుమతులు కూడా లేవు. మినరల్ వాటర్ ప్లాంట్‌లకు రెవెన్యూ, ఫుడ్ కంట్రోల్ అధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఆయా విభాగాల్లో సిబ్బంది కొరత వలన ప్లాంట్‌ల నిర్వహణపై తగిన పర్యవేక్షణ ఉండడంలేదు. మినరల్ వాటర్ ప్లాంట్‌లపై గతంలో నగరపాలక సంస్థకు అజమాయిషీ ఉండేది. కాని 15 ఏళ్ల క్రితం ప్లాంట్‌లపై నిర్వహణ అంతా ఫుడ్ కంట్రోల్ శాఖకు బదిలీ చేశారు. నగరంలోని 40శాతం జనాభా ఈ ప్లాంట్ల నుంచి వచ్చిన మినరల్ నీటినే తాగునీటిగా వినియోగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా నగరంలోని పలు ప్రాంతాల్లో వాంతులు, విరేచనాలతో పలువురు ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

దృష్టి సారించాలి..

నగరంలో ప్రస్తుతం అనారోగ్యాలకు రోడ్ల పక్క పానీపూరి బండ్లు, అరక్షిత ప్రాంతాల్లో విక్రయిస్తున్న తినుబండారాలు కూడా కారణం కావచ్చని రీజినల్ ల్యాబ్ నగర కమిషనర్‌కు నివేదించారు. అలాగే నగరంలో విచ్చలవిడిగా, ప్రమాణాలు పాటించని మినరల్ వాటర్ ప్లాంట్‌లు కూడా అనారోగ్యాలకు కారణం అవుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప ప్రజారోగ్యానికి భరోసా లభించదు.

పరీక్షల్లో విస్తుపోయే వాస్తవాలు..



తాగునీటి కాలుష్యం వలన అనారోగ్యం ఏర్పడుతుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో కార్పొరేషన్ సరఫరా చేసే నీటిని పరీక్షలు చేస్తున్నా అంతా ప్రమాణాల మేరకే ఉన్నట్లు నివేదికలు వచ్చాయి. దీంతో మెడికల్ కాలేజీలోని రీజినల్ ల్యాబొరేటరీ నగరంలోని పలు ప్రాంతాల్లోని మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి శ్యాంపిల్స్ సేకరించి, ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలలో శ్రీనగర్, కాకుమానువారితోట, ఐపీడీ కాలని, ఎన్జీఓ కాలనిలోని ప్లాంట్లలోని తాగునీటిలో నిర్దేశిత పీహెచ్ లెవల్స్(పొటెన్షియల్ ఆఫ్ హైడ్రోజన్) 6.5కన్నా తక్కువగా నమోదు అయింది. పీహెచ్ లెవల్స్ తక్కువ, లేదా ఎక్కువ అవ్వడం వల్ల క్లేబిసిల్లా, ఈకొలి బ్యాక్టీరియా ఉత్పన్నమై వాంతులు, విరేచనాలు, చర్మ వ్యాధులు ప్రభలే అవకాశం ఉంది. ఆదివారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో శ్రీనగర్‌లోని శ్రీ సాయి ఫ్లావర్డ్ మినరల్ వాటర్ ప్లాంట్‌లో నీరు కలుషితంగా ఉన్నా విక్రయిస్తున్నారని, స్థానికులు ఫిర్యాదు చేయగా వెంటనే ఫుడ్ కంట్రోల్ అధికారులకు సదరు ప్లాంట్‌ని సీజ్ చేయాలని ఆదేశించారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి నగరంలోని అన్ని మినరల్ వాటర్ ప్లాంట్‌ల నుంచి నీటి శ్యాంపిల్స్ సేకరించాలని, నిర్దేశిత ప్రమాణాలు పాటించని ప్లాంట్‌లను సీజ్ చేయాలని ఫుడ్ కంట్రోల్ అధికారులకు లేఖ రాశారు.

మినరల్ వాటర్ ప్లాంట్లు సీజ్

నెహ్రూనగర్: ప్రజారోగ్యానికి భంగం కల్గిస్తూ నిర్దేశిత ప్రమాణాలు పాటించకుండా నీటి విక్రయాలను చేసే మినరల్ వాటర్ ప్లాంట్‌లు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, పోలీసులు సంయుక్తంగా నిబంధనలు ఉల్లంఘించినట్లు రీజినల్ ల్యాబ్ గుర్తించిన మినరల్ వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో అనధికార, ప్రమాణాలు పాటించని అనేక వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయన్నారు. ఇటీవల గుంటూరు మెడికల్ కాలేజీలోని రీజినల్ ల్యాబ్ కొన్ని ప్లాంట్లలోని శాంపిల్స్ సేకరించిందన్నారు. నిర్దిష్టమైన ప్రమాణాలు పాటించని శ్రీనగర్‌లోని సాయి ఫ్లేవర్స్ వాటర్ ప్లాంట్, కాకుమానువారితోటలోని బ్లూ డ్రాప్స్, శారదా కాలనీ మెయిన్ రోడ్డు లోని శ్రీ తేజశ్రీ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, ఐపీడీ కాలనీ మెయిన్ రోడ్ లోని లిల్లీ మినరల్ వాటర్ ప్లాంట్, అనురాధ వాటర్ ప్లాంట్, ఎన్జీఓ కాలని సప్తగిరి ఎంటర్ ప్రైజెస్‌లను సోమవారం సీజ్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ శ్రీనగర్ పర్యటన సమయంలో కూడా స్థానికులు శ్రీనగర్‌లోని మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి విక్రయిస్తున్న నీరు అనారోగ్యాలకు కారణం అవుతుందని ఫిర్యాదు చేయగా, స్పందించిన కలెక్టర్ సదరు ప్లాంట్‌ను సీజ్ చేయాలని ఆదేశించారని తెలిపారు. నగరంలో నిర్దేశిత ప్రమాణాలను పాటించని వాటర్ ప్లాంట్‌లపై దాడులు కొనసాగుతాయని, ప్రజారోగ్యానికి భంగం కల్గించే ప్లాంట్‌లపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. వార్డు సచివాలయాల వారీగా అధికార, అనధికార మినరల్ వాటర్ ప్లాంట్‌ల వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఈ దాడుల్లో సీఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్ఓ మధుసూదన్, ఏసీపీ అజయ్ కుమార్, టీపీఎస్ సువర్ణ కుమార్, రసూల్, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆయుబ్ ఖాన్, సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఐపీడీ కాలనీలోని వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బంది సస్పెన్షన్

నెహ్రూనగర్: విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నవారిపై చర్యలు తప్పవని, అత్యవసర సమయాల్లో అంకిత భావంతో విధులు నిర్వహించడం ఉద్యోగులు, అధికారుల బాధ్యత అని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారదకాలనీలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం చూపిన ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయం కార్యదర్శులను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని శారదకాలనీలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో డ్రైన్‌లు, రోడ్ల నిర్మాణం సమయంలో నీటి కుళాయిలను షిఫ్ట్ చేయకపోవడం, డమ్మీలను క్లోజ్ చేయకపోవడం, వాల్వ్‌పిట్స్ శుభ్రం చేయడంలో నిర్లక్ష్యవైఖరి ప్రదర్శించిన ఘటనల్లో సంబంధిత ఏఈ ఎం.అనూష, ఎమినిటీ కార్యదర్శులు వి.నాగరామ కోటయ్య, ఎం.శృతి కీర్తనలను విధుల నుంచి సస్పెండ్ చేశామని, వాల్వ్ ఆపరేటర్ చెంచయ్యను విధుల నుంచి తొలగించామన్నారు. ఈఈ కె.కోటేశ్వరరావు పూర్తిస్థాయి పర్యవేక్షణ లోపం ఉన్నందున షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. ఆ ప్రాంతాల్లో డ్రైన్‌లలో పూడిక తొలగింపులో నిర్లక్ష్యం, పారిశుద్ధ్య పనుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రాము, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు ఎస్.ఆంజనేయులు, డి.వెంకట సురేష్‌లను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ, శానిటేషన్ సూపర్‌వైజర్ ఆయుబ్ ఖాన్‌కు పర్యవేక్షణ లోపంపై షోకాజ్ నోటీసు జారీ చేశామని తెలిపారు.

న్యూస్‌రీల్

జెడ్పీలో కారుణ్య, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ



గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో కారుణ్య నియామకాలతోపాటు బ్యాక్‌లాగ్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులకు సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నియామక ఉత్తర్వులు అందజేశారు. వికలాంగులకు రిజర్వ్ కేటాయించబడిన బ్యాగ్‌లాగ్ ఖాళీలను జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించిన స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో ఆఫీసు సబార్డినేట్ పోస్టుకు ఎంపికై, జెడ్పీకి కేటాయించిన కొప్పురావూరి లక్ష్మయ్యను మేడికొండూరు ఎంపీడీవో కార్యాలయం, బుస్సా సరితను వేమూరు మండలం పెరవలి జెడ్పీ హైస్కూల్లో నియమించారు. రెంటచింతల మండలం మల్లవరం ఎంపీపీ స్కూల్లో ఎస్జీటీగా పనిచేస్తూ మృతి చెందిన ముక్కాల రామసుబ్బయ్య కుటుంబ జీవనాధారం కోసం అతని కుమారుడైన ముక్కాల ఆదర్ష్‌కు సామాజిక భద్రత ప్రాతిపదికన కారుణ్య నియామకంపై జెడ్పీలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించారు.

యార్డులో 1,48,759 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,48,759 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,33,190 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 95,912 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

దేవాలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ

పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్



చిలకలూరిపేట: మండలంలోని బొప్పూడి గ్రామంలో వేంచేసియున్న చెన్నకేశవ స్వామి, మల్లేశ్వరస్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ సతీసమేతంగా పాల్గొన్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవదాయశాఖ నిధులు రూ.1.50 కోట్లతో పునర్నిర్మాణ పనులు నిర్వహించనున్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, డీఎఫ్ఓ ఎస్.రామచంద్రరావు, డిప్యూటీ కలెక్టర్ బి.నారదముని, ఎంపీపీ దేవినేని శంకరరావు, గ్రామ సర్పంచ్ షేక్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

రేపు గుంటూరు-వరంగల్ ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు నుంచి వరంగల్‌కు బుధవారం ప్రత్యేక రైలును కేటాయించడం జరిగిందని సీనియర్ డీసీఎం డాక్టర్ సీహెచ్ ప్రదీప్ కుమార్ సోమవారం తెలిపారు. గుంటూరు-వరంగల్ రైలు(07016)గుంటూరు నుంచి ఉదయం 6.40 గంటలకు బయలు దేరి, అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు వరంగల్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక రైలు విజయవాడ, మధిర, మోటమర్రి, బోనకల్లు, చింతకాని, ఖమ్మం, పాపటపల్లి, డోర్నకల్, మహబూబాబాద్, కె.సముద్రం, చింతపల్లి స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6600, గరిష్ట ధర రూ.8200, మోడల్ ధర రూ.7200 వరకు పలికింది.

మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి పార్థసారథి



సమావేశాల్లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పార్థసారథి

పొన్నూరు: మార్చి 9న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి పార్థసారథి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా జడ్జి పార్థసారథి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బ్యాంకు కేసులు, పీఎల్‌సీలు, క్రిమినల్, సివిల్ కేసులు, పరిష్కరించదగ్గ కేసులు కక్షిదారులతో మాట్లాడి వ్యయ ప్రయాసలకు లోను కాకుండా తక్షణ న్యాయం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా సన్నద్ధం చేయాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి, పొన్నూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వర్ధన్ రావు, షేక్ బాజీ సాహెబ్, కోర్టు సూపరింటెండెంట్లు హరీష్, కిషోర్, అర్బన్, రూరల్ సీఐలు భాస్కర్, వై.కోటేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వైద్యసేవలు భేష్

- సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి
- వాంతులు, విరేచనాల బాధితులకు పరామర్శ



రోగులను పరామర్శిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి లీలావతి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని, వైద్యులు, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి అన్నారు. జీజీహెచ్‌లో వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం న్యాయమూర్తి పరామర్శించారు. ఆసుపత్రిలో ఎన్నిరోజుల నుంచి చికిత్స పొందుతున్నారు? వైద్యసేవలు ఎలా ఉన్నాయి? ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందంటూ బాధితులను ప్రశ్నించారు. రోగుల సహాయకులతో కూడా ఆమె మాట్లాడి ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లిన తరువాత తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోగులు వైద్యసేవలు బాగున్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు జీజీహెచ్‌లో రోగులను పరామర్శించేందుకు వచ్చామన్నారు. ఆసుపత్రిలో వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరినీ పలుకరించామని, అందరూ వైద్యసేవలు బాగున్నాయని చెప్పారన్నారు. స్వయంగా పలు వార్డులు పరిశీలించి రోగులకు సకాలంలో వైద్యసేవలు అందుతున్నాయని, పరిశుభ్రత బాగుందనే విషయం తెలుసుకున్నామన్నారు. రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలందించి ప్రాణాలు కాపాడుతున్న వైద్యులను అభినందించారు. సీనియర్ సివిల్ జడ్జి వెంట మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశసజని ఉన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: జగనన్న బడుగు వికాసం పథకం కింద లబ్ధి పొందిన వారు సకాలంలో బ్యాంకు రుణాలను తిరిగి చెల్లించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఆరు రకాల వాహనాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గతంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన నవోదయంలో దరఖాస్తు చేసుకున్న ఆరుగురు లబ్ధిదారులకు ఈ వాహనాలు 45శాతం రాయితీపై లభించాయి. కలెక్టర్ మాట్లాడుతూ అమరావతి మండలం అత్తలూరుకు చెందిన బంక శ్రీనివాసరావుకు రూ.60లక్షల విలువైన పొక్లెయిన్ లభించగా, నరసరావుపేట పట్టణానికి చెందిన కందుల ఎఙ్రా రూ.18లక్షలు విలువైన క్రెటా కారు పొందారు. అలాగే నరసరావుపేట మండలానికి చెందిన కోటేశ్వరరావుకు రూ.9.50లక్షల విలువైన డీజిల్ కారు, అదే మండలానికి చెందిన ఎ.సుభాషిణికి రూ.16లక్షలు విలువైన స్కార్పియో వాహనం, పిడుగురాళ్ల నియోజకవర్గంలోని మాచవరం మండలంకు చెందిన మురికిపూడి కల్యాణి, ఎం.రమేష్‌లకు ఒక్కొక్కరికి రూ.10లక్షలు విలువైన బడా దోస్త్ మినీ లారీలు అందజేశారు. నవోదయం నోడల్ ఆఫీసర్ కె.సంజీవరావు, జిల్లా పరిశ్రమల అధికారి పి.వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం శ్రీనివాస రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లాయర్లకు అండగా జగనన్న ప్రభుత్వం

- రాష్ట్ర చరిత్రలో తొలిసారి లా నేస్తం అమలు
- వైఎస్సార్ లా నేస్తం కింద ఏకంగా రూ.50 కోట్ల ఆర్థిక సాయం
- రూ.100 కోట్లతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్టు
- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్‌తో ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ సీపీకి బలం లీగల్ విభాగమే : లేళ్ల అప్పిరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి రజని, పక్కన ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి, పోలూరి, బ్రహ్మరెడ్డి

పట్నంబజారు: న్యాయవాదులకు జగనన్న ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. స్థానిక చంద్రమౌళినగర్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ దేశ చరిత్రలో న్యాయవాదుల కోసం లా నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టిన గొప్ప నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. ఇప్పటివరకు ఏకంగా రూ.50 కోట్లను లా నేస్తం కింద యువ లాయర్లకు తమ ప్రభుత్వం అందజేసిందని గుర్తు చేశారు. ఏకంగా రూ.100 కోట్ల నిధులతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్టును ప్రభుత్వం ఏర్పాటుచేసిందని తెలిపారు. ఇంతలా లాయర్లకు అండగా నిలబడిన జగనన్నకు మనమంతా తిరిగి అదేస్థాయిలో మేలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. పేదోడి తరపున లాయర్లంతా చిత్తశుద్ధితో పోరాడినప్పుడే జగనన్న చేస్తున్న సాయానికి సార్థకత చేకూరుతుందని స్పష్టం చేశారు.

గెలుపే లక్ష్యంగా ముందుకెళదాం..

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మనమంతా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి రజిని తెలిపారు. మోసం చేయడం తమకు చేతకాదని, ఉన్నది ఉన్నట్లుగా తాము వ్యవహరిస్తానని వివరించారు. వరుసగా రెండు సార్లు మనం పశ్చిమ నియోజకవర్గంలో గెలవలేకపోయామని, అందుకు కారణాలు ఏమైనా గాని, వచ్చే ఎన్నికల్లో మాత్రం ఎలాంటి తప్పులు జరగకుండా ముందుకు సాగాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. డివిజన్‌ల వారీగా పూర్తిస్థాయిలో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమలో పార్టీ గెలుపు కోసం ఏందాకైకా కష్టపడి పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. ప్రజల అండదండలు మనకే ఉన్నాయని, ఉత్సాహంగా ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి..

శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి లీగల్ విభాగమే ఎంతో బలమని, పార్టీకి పూర్తి స్థాయిలో అండగా నిలబడుతూ లీగల్ విభాగం ఎంతో కృషి చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి, కె.రామకృష్ణారెడ్డి, లీగల్ సెల్ నాయకులు సయ్యద్‌బాబు, అబ్రహం లింకన్, పోకల వెంకటేశ్వర్లు, బార్ కౌన్సిల్ సభ్యులు రోళ్ల మాధవి, వి.బ్రహ్మారెడ్డి, క్రాంతి అనిల్, మొండితోక శ్రీనివాసరావు, ఎంవీ సుబ్బారెడ్డి, శ్యామల సుధాకర్‌రెడ్డి, మంజుల, ఝాన్సి, రత్నకుమారి, రేవతి, బాలా త్రిపురసుందరి, ఇందిర, సోని, లీగల్ విభాగం నేతలు, న్యాయవాదులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కావొద్దు

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- స్పందనలో 178 అర్జీలు



సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: స్పందన కార్యక్రమంలో వస్తున్న అర్జీలపై అధికారులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మాట్లాడుతూ స్పందనలో వస్తున్న అర్జీలు పునరావృతం కాకుండా, ముందుగానే ఆయా శాఖాధికారులు అప్రమత్తమవ్వాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరిస్తున్న అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించాలని తెలిపారు. అనంతరం వచ్చిన 178 అర్జీలను కలెక్టర్, డీఆర్ఓ పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వాతి, లక్ష్మీకుమారి, అధికారులు పరిశీలించారు.

7 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు వివరాలు తెలిపారు. మార్చి 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మార్చి 8వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణం రావి ఉదయ్‌కిరణ్, దీప్తి పుణ్య దంపతుల చేతుల మీదగా జరుగుతుందన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఆహ్వానపత్రిక ఆవిష్కరించిన వారిలో ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు, ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్, కల్యాణం చేసే దంపతులు రావి ఉదయ్‌కిరణ్, దీప్తి, భక్తులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను కాపాడండి



పేదలకు చెందాల్సిన వేల ఎకరాల వక్ఫ్ భూములు అక్రమార్కుల పాలవుతున్నాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం, గనికపూడి గ్రామంలో ఉన్న 198 ఎకరాలు సత్వరం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. వక్ఫ్ ఆస్తులను లీజుకు తీసుకుని చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలి. ఆస్తులు అక్రమార్కుల పాలు కాకుండా గెజిట్ చేయించాలి.

– షేక్ మస్తాన్, సుభాని, తదితరులు, గుంటూరు

పింఛన్ ఇచ్చి ఆదుకోండయ్యా..



నేను దివ్యాంగుడిని. నాకు కనీసం రేషన్ కార్డులేదు. నాకు ఎవ్వరూ లేరు. పింఛన్ కూడా రావడంలేదు. రేషన్ కార్డు, పింఛన్ ఇప్పించి పుణ్యం కట్టుకోండి.

– యు.రామారావు, స్వర్ణభారతి నగర్

నేడు మార్కెట్‌యార్డుకు డైరెక్టర్ రాక

తెనాలిటౌన్: పట్టణ సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఉదయం వస్తున్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి జె.వి.సుబ్బారావు సోమవారం తెలిపారు. యార్డులోని గిడ్డంగులు, నిమ్మకాలయ కొనుగోళ్లు, ఈనామ్ కేంద్రాలను ఆమె సందర్శిస్తారని చెప్పారు.

ప్రభుత్వ పాలనలో కులమతాలకు అతీతంగా అభివృద్ధి

రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

ప్రత్తిపాడు: కులమతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసే ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో రూ.52 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సోమవారం రాత్రి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమం మురుకుంట్ల సురేంద్ర ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథులుగా అయోధ్య రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ కత్తెర క్రిస్టినా, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ఉమ్మారెడ్డి వెంకటరమణ, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్‌లు హాజరయ్యారు. రూ.17.50 లక్షలతో ఎస్సీ కాలనీ రామానగర్‌లో నిర్మించిన సిమెంటు రోడ్డు, రూ.10 లక్షలతో ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు, రూ. 5 లక్షలతో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి, రూ.15 లక్షలతో నిర్మించిన జీఎస్‌బీ రోడ్డుతో పాటు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఎస్టీ కాలనీ వరకు ఏర్పాటు చేసిన వాటర్ పైప్ లైన్ పనులతో పాటు మరో నాలుగున్నర లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డుకు సంబంధించిన ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు.

నేనూ మీ ఊరి మనవడినే..

నేనూ మీ ఊరి మనవడినే.. నేనెప్పుడూ మీకు అందుబాటులో ఉంటానని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో ఈ గ్రామంలో టీడీపీకి అత్యధిక ఓట్లు వచ్చినప్పటికీ పార్టీలను, కులాలను పక్కనబెట్టి గ్రామాన్ని అభివృద్ధి చేశామన్నారు. అదే వైఎస్సార్‌సీపీ సిద్ధాంతమని తెలిపారు. ఇకపై కూడా గ్రామ అభివృద్ధికి తనవంతుగా సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని, ఆ పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భీమినేని వెంకటలక్ష్మి, చిలకా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, తదితరులు

వైద్యులకు అండగా ఉంటాం

డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవంలో మంత్రి విడదల రజిని

గుంటూరు మెడికల్ : సమాజంలో దేవుడితో సమానమైన వైద్యులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని భరోసా ఇచ్చారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటును మంత్రి విడదల రజిని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్థానిక అమరావతి రోడ్డులోని శ్రీరస్తు కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నిత్యం రోగుల సేవలో ఉండే వైద్యులకు క్రీడలు మానసిక ఆనందాన్ని ఇస్తాయన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైద్య ఆరోగ్యశాఖ కృషి చేస్తుందన్నారు. దీనికి వైద్యుల సహకారం మరువలేనిదన్నారు. ఐఎంఏ గుంటూరు శాఖ కార్యదర్శి డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్రంలోనే అత్యధికంగా పలు రకాల ఆపరేషన్లు, వైద్య సేవలు గుంటూరు జిల్లాలోనే జరుగుతాయని, గుంటూరు మార్గనిర్దేశంగా నిలుస్తుందన్నారు. డీపీఎల్ లోగోను ఆవిష్కరించారు. మంత్రి రజినిని వైద్యులు ఘనంగా సత్కరించారు. డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ లో పాల్గొంటున్న ఎనిమిది బృందాలు మంత్రి రజినీతో ఫోటోలు దిగి సందడి చేశారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు కొండబోలు కృష్ణ ప్రసాద్, ఆవుల శ్రీనివాస్, టి.చంద్రశేఖర్ రెడ్డి, అన్వర్ హుస్సేన్, బాలినేని సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్స్ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

మహిళలు, వృద్ధుల ఫిర్యాదులకు ప్రాధాన్యం

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- స్పందనలో బాధితుల నుంచి అర్జీల స్వీకరణ

నగరంపాలెం: కొలువులు యిప్పిస్తామని పరిచయం ఉన్న వారు మోసగించారని కొందరు, విద్యార్థినుల పట్ల కొందరు ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ స్థానికులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన జగనన్నకు చెబుదాం (స్పందన)లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బాధితుల ఫిర్యాదులను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ స్వీకరించారు. వారి బాధలను స్వయంగా అలకించారు. కొందరు వయోవృద్ధుల అర్జీలను విని, న్యాయం చేస్తామని వారికి హామీ యిచ్చారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, వృద్ధుల ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత యివ్వాలని సూచించారు. అర్జీలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పలువురి ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ అధికారులకు మొబైల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ.రమణమూర్తి, ఎ.శ్రీనివాసరావు (క్రైం), ట్రాఫిక్ డీఎస్పీ బీవీ.నాయుడు అర్జీలు స్వీకరించారు.



వృద్ధురాలి అర్జీని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

పదో తరగతి పరీక్షల నిర్వహణపై దృష్టి పెట్టండి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్ : పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 18 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 420 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 31,291 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. దీని కోసం ఇప్పటికే 147 కేంద్రాలను గుర్తించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, విద్యుత్, పార్కింగ్, తదితర ఏర్పాట్లు సమన్వయంతో చేయాలన్నారు. పరీక్షల నిర్వహణలో సిబ్బందికి సందేహాలు, సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పక పాటించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వాతి, లక్ష్మీ కుమారి, డీఈఓ శైలజ, ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

జేపీసీఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా ఈదులమూడి

పట్నంబజారు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా జేపీసీఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా ఈదులమూడి డేవిడ్‌రాజును నియమించారు. ఈ మేరకు సోమవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఉరి వేసుకుని బాలుడు బలవన్మరణం

పర్చూరు (చినగంజాం): తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన పర్చూరు మండల కేంద్రంలో సోమవారం జరిగింది. ఎస్ఐ ఎస్.రమేష్ వివరాల మేరకు.. పర్చూరు గ్రామానికి చెందిన షేక్ మౌలాలి కుమారుడు షేక్ జిలాని (14) స్థానికంగా ఓ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తక్కువ మార్కులొచ్చాయని తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురై జిలాని సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూం లోని హ్యాంగర్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

చెరుకుపల్లి: కంటి వైద్య పరీక్షలు చేయించుకునేందుకు తెనాలి బయలు దేరిన మహిళ రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరుకుపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపేటకు చెందిన తాళ్లపల్లి సుశీల(57) అనే మహిళ కంటి వైద్యం చేయించుకునేందుకు సోమవారం ఉదయం తెనాలి వెళ్లేందుకు బస్సు ఎక్కేందుకు గానూ స్థానిక అంబేడ్కర్ సెంటర్ నందు జాతీయ రహదారి దాటుతుండగా రేపల్లె నుంచి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొంది. స్థానికులు ఆమెను దగ్గరలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ సుశీల మృతి చెందింది. మృతురాలి కుమారుడు సుబ్బారావు ఫిర్యాదు మేరకు ఎస్సై వై.సురేష్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



మృతి చెందిన సుశీల

అట్టహాసంగా ఆసరా నమూనా చెక్కు పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: రూరల్ మండలం పరిధిలో వైఎస్సార్ నాలుగో విడత ఆసరా సంబరాలు సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అట్టహాసంగా జరిగాయి. మండల పరిధిలోని వివిధ గ్రామాల్నుంచి తరలివచ్చిన వేలాదిమంది మహిళలతో మార్కెట్ యార్డులోని షెడ్లు నిండిపోయాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మండల పరిధిలోని డ్వాక్రా సంఘాలకు నాలుగో విడతగా రూ.12.56 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. సభకు పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎంపీడీవో శిల్ప, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నేతలు హాజరయ్యారు.

రాజశ్యామల యాగంలో అంబటి మురళీకృష్ణ



విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులు అందుకుంటున్న బజరంగ్ ఫౌండేషన్ అధినేత అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: విశాఖ శారదా పీఠంలో ఐదు రోజులుగా జరుగుతున్న వార్షికోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాజశ్యామల యాగంలో ఆఖరి ఘట్టమైన మహా పూర్ణాహుతి కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ అధినేత అంబటి మురళీకృష్ణ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాజశ్యామలాదేవి శక్తివంతమైన దేవత అని, ఆమెను పూజించి హోమాలు చేయటం వల్ల వ్యాపార, రాజకీయ జీవితంలో విజయం ప్రాప్తిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 175 స్థానాలకు గానూ 175 స్థానాల్లో విజయం సాధించి తిరిగి అధికారంలోకి రావాలని, సుస్థిర సంక్షేమ ప్రభుత్వమే మళ్లీ కొనసాగాలని ఆకాంక్షించారు. త్వరలో పొన్నూరు పట్టణంలో జరగనున్న బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ మహాస్వామిని ఆహ్వానించామన్నారు. వారు రావడానికి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు.

సాయుధ దళాల నిధికి రూ.లక్ష విరాళం

జిల్లా కలెక్టర్‌కు అందజేసిన కోస్టల్ బ్యాంకు అధికారులు

గుంటూరు వెస్ట్ : సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి కోస్టల్ బ్యాంకు అధికారులు రూ.లక్ష విరాళాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. సోమవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ చెక్కును జిల్లా సంక్షేమ అధికారి ఆర్ గుణశీలకు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోస్టల్ బ్యాంకు ఇచ్చిన విరాళం ఎంతో గొప్పదన్నారు. ఇదే స్ఫూర్తితో మిగతా సంస్థలు ముందుకు రావాలన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగాలకు వెనుకాడని సైనికులకు మన వంతు సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో కోస్టల్ బ్యాంకు క్లస్టర్ హెడ్ జె.హరిప్రసాద్, షేక్ గౌస్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డికి చెక్కు అందజేస్తున్న కోస్టల్ బ్యాంకు అధికారులు

హత్య కేసులో నిందితులకు జైలుశిక్ష

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెనుమాక, కృష్ణాయపాలెం గ్రామాల మధ్య పంట పొలాల్లో జరిగిన హత్యకేసులో గుంటూరు 2వ అదనపు జిల్లా కోర్టు జడ్జి జి.మాధవి సోమవారం తీర్పు వెల్లడించారు. కృష్ణాయపాలెం, పెనుమాక అమరావతి రోడ్డులోని కొండవీటి వాగు ఒడ్డున ఉన్న బెండతోటలో ఈ నెల 14న బుల్లా రవికుమార్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. కృష్ణాయపాలెంకు చెందిన బుల్లా రవికుమార్ తండ్రి సామ్యేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ సీఐ మధుసూదన రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. బుల్లా రవికుమార్ హత్యకు కారకులు అతని భార్య రాణి మరియు పెనుమాకకు చెందిన కిరణ్‌లని పోలీసులు దర్యాప్తులో కనుగొన్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు ఋజువు కావడంతో గుంటూరు 2వ అదనపు జిల్లా కోర్టు జడ్జి వారి వారిద్దరికీ యావజ్జీవ శిక్ష విధించారు. వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

గండ్లూరు అడ్డరోడ్డులో పొలాల్లోకి దూసుకుపోయిన స్కూలు బస్సు

సత్తెనపల్లి: విద్యార్థులకు పెను ప్రమాదం తృటిలో తప్పిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గండ్లూరు అడ్డ రోడ్డు సమీపంలో సోమ వారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి పట్టణంలోని రఘురాంనగర్ లోగల యూనిక్ కాన్సెప్ట్ పాఠశాలకు సత్తెనపల్లి చుట్టుపక్కల వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు స్కూల్ బస్సులో నిత్యం రాకపోకలు సాగిస్తారు. సోమవారం సాయంత్రం పాఠశాల పూర్తి కాగానే ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివే పాకాలపాడు, అబ్బూరు, ఫణిదం, భట్లూరు గ్రామీణ ప్రాంత విద్యార్థులు స్కూల్ బస్సులో ఇళ్లకు వెళ్లేందుకు బస్సు ఎక్కారు. స్కూల్ బస్సు సత్తెనపల్లి మండలం గండ్లూరు అడ్డరోడ్డు సమీపంలోకి ప్రవేశించగానే స్కూల్ బస్సు డ్రైవర్ ప్రసాద్ కు ఒక్కసారిగా బీపీ పెరిగి తల తిరగడంతో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో డ్రైవర్, అబ్బూరుకు చెందిన ఒక ఉపాధ్యాయురాలు, 40 మంది విద్యార్థులు ఉన్నారు. బస్సు పంట పొలాల్లో గుండా కొద్ది దూరంలో చెట్టును తగిలి పొగతోటలోకి దూసుకెళ్లింది. బస్సులో ఉన్న విద్యార్థులు భయాందో ళనకు గురై కేకలు పెట్టారు. సత్తెనపల్లి-అచ్చంపేట ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో స్కూల్ బస్సు అదుపు తప్పటాన్ని గమనించిన వారు అక్కడకు చేరుకున్నారు. ఈ లోగా తల్లిదండ్రులకు సమాచారం అందడంతో హుటా హుటిన తల్లిదండ్రులు అక్కడకు చేరుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. స్కూల్ బస్సులో ఉన్న విద్యార్థులను క్రిందకు దించే ప్రయత్నం చేశారు. పంట పొలాల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సులోని తమ బిడ్డలను తల్లిదండ్రులు గుండెలకు హత్తుకొని గండం తప్పిందంటూ దేవుని వేడుకున్నారు. కాగా ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఒక విద్యార్థికి మాత్రం గతంలో కాలికి దెబ్బ తగలగా ప్రస్తుతం అక్కడ రాసుకొని రక్తం వచ్చింది తప్ప ఎవరికీ ఎలాంటి గాయాలు కూడా కాలేదని మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు చెప్పారు. ఈ ఘటన అటు తల్లిదండ్రులను, ఇటు విద్యా శాఖ అధికారులను ఆందోళనకు గురి చేసింది. జరిగిన సంఘటన పై విద్యా, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు ఆరా తీశారు.

రేపు మినీ జాబ్ మేళా

లక్ష్మీపురం: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు ఐటీఐ కళాశాల జిల్లా కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ ఉపాధి అధికారి కె.రమాదేవి సోమవారం తెలిపారు. పరిసర ప్రాంత యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాకు ప్రముఖ కంపెనీలైన వసంత ఇండ్రస్ట్రీస్, అపోలో ఫార్మసీ, ఫ్లిప్‌కార్ట్ వంటి కంపెనీలు హాజరు అవుతాయని తెలిపారు. నెలసరి జీతం విద్యార్హతను బట్టి రూ.10వేల నుంచి రూ.35 వేల వరకు ఉంటుందని చెప్పారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ, పీజీ వరకు చదువుకున్న 18 నుంచి 35 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ధృవపత్రాలతో హాజరు కావాలని తెలిపారు. ఈ మినీ జాబ్ మేళా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9652065235, 9866822697 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి కబడ్డీ పోటీలు

సత్తెనపల్లి: 33వ ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ అంతర్ జిల్లాస్థాయి బాల, బాలికల కబడ్డీ పోటీలు ఈనెల 21 నుంచి 23 వరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వృంద మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతాయని వృంద విద్యాసంస్థల డైరెక్టర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అనూష గంగారపు సోమవారం తెలిపారు. వృంద మహిళా జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్, డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, విశిష్ట అతిథిగా నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, నెల్లూరు శాసనసభ్యుడు డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్, ఆత్మీయ అతిథులుగా పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి, ప్రగతి జూనియర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ పరిటాల నరేష్, ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వై.శ్రీకాంత్ హాజరవుతారన్నారు.